

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని అమలాపురం రూరల్ సిఐ డి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. డ్రగ్స్ వినియోగంపై కలిగే నష్టాలు, రోడ్డు భద్రత వంటి విషయాలపై ప్రజలు పూర్తిగా అవగాహన పెంచుకోవాలని ఆయన అన్నారు. గొల్లవిల్లి భీమేశ్వర ఆడిటోరియంలో మంగళవారం ఎస్ఐ సిహెచ్.రాజేష్ అధ్యక్షతన ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దని, మత్తు పదార్థాల వల్లే అధికంగా ప్రమాదాలు నేరాలు జరుగుతున్నాయని అన్నారు. అలాగే హెల్మెట్ విధిగా ధరించాలని అతివేగంగా వాహనాల నడిపి ప్రమాదాలు తెచ్చుకోవద్దని సిఐ ప్రశాంత్ కుమార్ సూచించారు.



మాట్లాడుతున్న సిఐ ప్రశాంత్ కుమార్

వంద రోజుల ప్రణాళికతో ఒత్తిడి


- ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు, టెన్త్ విద్యార్థులు
- మార్కుల వేటలో పెరుగుతున్న ఆందోళన
- సెలవుల్లో తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత

ప్రజాశక్తి - రాజోలు

రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి విద్యార్థుల కోసం 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ నెల 6వ తేదీ నుంచి జిల్లాలో అమల్లోకి వచ్చింది.100 శాతం ఫలితాలు సాధించడం కోసం దీన్ని ప్రవేశపెట్టినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే రోజంతా తరగతులు, మళ్లీ ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు, సెలవు రోజుల్లో కూడా తరగతుల నిర్వహణ కారణంగా పిల్లలకు విశ్రాంతి కరువవుతోంది. రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 దాకా బడిలోనే గడపాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇక స్థానికంగా హైస్కూల్‌లో లేక సమీపంలోని గ్రామంలో ఉన్న పాఠశాలలకు వెళ్లే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తల్లిదండ్రులు, టీచర్లు చెబుతున్నారు.

సంక్రాంతి సెలవుల్లోనూ బడికి వెళ్లాల్సిందే

జిల్లాలోని 397 ప్రభుత్వ పాఠశాలల్లో 19,640 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరంతా ఈ నెల 6వ తేదీ నుంచి మార్చి 14వ తేదీ వరకూ సెలవు రోజుల్లో కూడా బడికి వెళ్లాల్సిందే. రోజూ ఉదయం, సాయంత్రం మరో రెండు గంటలు అదనంగా బడిలో



కూర్చోవాలి. పిల్లలతో పాటు 10వ తరగతికి బోధించే ఆయా సబ్జెక్టు టీచర్లు కూడా సంక్రాంతి సెలవుల్లో బడికి వెళ్లాల్సిందే. సెలవురోజుల్లో పనిచేసే వారికి సిసిఎల్ కూడా ఇవ్వకుండా కనీస పనిదినాల అంశాన్ని ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. దీనికి తోడు ప్రస్తుతం వాట్సాప్ ద్వారా పంపే ప్రశ్నపత్రాలను జిరాక్స్ చేసుకుని పరీక్ష నిర్వహించడం, వాటిని దిద్ది అదే రోజు 'లీప్ యాప్' లో నమోదు చేయాల్సి రావడంతో టీచర్లంతా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు సెలవుదినాల్లోనూ పని చేయాల్సి రావడంపై పెదవి విరుస్తున్నారు. జిల్లలో ఒక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 40 మంది పదో తరగతి విద్యార్థులున్నారు. వీరిలో 20 మంది రోజూ 8 కి.మీ నడిచి స్కూల్‌కు వచ్చి.. మళ్లీ సాయంత్రం ఇళ్లకు వెళ్తారు. ప్రస్తుతం సాయంత్రం 5.15 గంటలకే సూర్యాస్తమయం అవుతుండగా.. పిల్లలు ఇంటికి చేరే సరికే చీకటి పడుతోంది. ఆటోలు కూడా లేనందున పిల్లలు బిక్కుబిక్కుమంటూ భయంతో ఇల్లు చేరుతున్నారు. ప్రభుత్వం తాజాగా రోజూ రెండు గంటలు అదనంగా స్కూళ్లలో తరగతులు ఏర్పాటు చేస్తుండటంతో పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పాఠశా లలోనే చీకటి పడితే ఎలా ఇళ్లకు చేరుకోవాలో తెలియక సతమ తమవుతున్నారు.

ఆందోళన అధిగమిస్తేనే విజయం..!

పరీక్షలు అనే సరికి విద్యార్థుల్లో రకరకాల ఆందోళనలు వస్తాయి. కొన్ని వారిని తీవ్రంగా వేదనకు గురిచేస్తాయి. ఈ తరుణంలో తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, అధ్యాపకులు వారికి అండగా నిలవాలి.

ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేయొద్దు

ఉపాధ్యాయులను మానసికి ఒత్తిడికి గురిచేయొద్దని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధించాల్సిన ఉపాధ్యాయులను రోజుకో స్కీం పేరుతో ఒత్తిడి తీసు కొస్తూ ఆదివారాలు, రెండో శనివారాలు పండగ సెలవుల్లో పనిచేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. పదో తరగతి బోధించే ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వకుండా ఇబ్బందికి గురిచేస్తున్నారు.. పదో తరగతి ఉత్తీర్ణత 100 శాతం పేరుతో ప్రతిరోజూ సాయంత్రం పరీక్ష నిర్వహించి మార్కులు అప్‌లోడ్ చేయాలని ఒత్తిడి చేయడం ద్వారా మానసిక వేధింపులకు గురిచేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల ప్రభుత్వం ఇచ్చిన సెలవులను సైతం 220 పనిదినాలు ఉన్నా.. రెండో శనివారం పనిచేయాలనే నిబంధన పెట్టారు. పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన అకడమిక్ క్యాలెండర్‌ను విద్యాశాఖే అమలు చేయని వింత పరిస్థితి నెలకొంది.-విద్యాశాఖ ఒత్తిడితో కొన్ని జిల్లాల కలెక్టర్లు ఉపాధ్యాయులపై రకరకాల స్కీమ్‌లను అమలు చేస్తున్నారని, లేకుంటే షోకాజ్‌లు ఇస్తున్నారు. 3 నుంచి 5 కి.మీ దూరంలో ఉన్నా.. కొన్ని ప్రాథమికోన్నత పాఠశాలలు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులను ఉన్నత పాఠశాలలకు మ్యాప్ చేశారు. రోజూ రాత్రి 9 గంటలకు, అర్థరాత్రి 12 గంటలకు, ఉదయం 6 గంటల వరకు బయోమెట్రిక్ వేయాలని ఉపాధ్యాయులను ఒత్తిడి . 2010కి ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలనిపై డిమాండ్ లకై ఈ నెల 18న జిల్లా కేంద్రాల్లో ధర్నా నిరసన కార్యక్రమాలు నిర్వహించాడానికి ఉపాధ్యాయ సంఘాలు సిద్ధం అయ్యాయి.

మానసిక స్థైర్యాన్ని నింపాలి

పరీక్షలు అనగానే సహజంగానే విద్యార్థులకు భయం ఉంటుంది. భయాన్ని తొలగించే ప్రయత్నం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి రావాలి. ప్రస్తుత విద్యావ్యవస్థలో ఉన్న ఒత్తిడి వల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. వారిని జాగ్రత్తగా గమనించాలి. మానసిక స్థైర్యాన్ని ఇవ్వడం ద్వారా వారు ధైర్యంగా పరీక్షలు రాయడానికి సమాయత్తమవుతారు.

- పివివి.వరప్రసాద్, సైకాలజిస్ట్, జెవివి నాయకులు

ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేయొద్దు

ఇప్పుడందరి ఆలోచన తమ పిల్లలు టాప్‌లో నిలవాలన్నదే. పిల్లల మానసిక పరిస్థితిని చూడటం లేదు. ఇతరుల పిల్లల మాదిరిగా తమ పిల్లలు చదవాలనే పట్టుదలకు పోతున్నారు. మార్కుల కన్నా జ్ఞానం అవసరం అన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి. చదువు విషయంలో వారికి ధైర్యమివ్వాలే తప్ప వారిపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేయొద్దు.

-బీరా అశోక్, ఆంగ్ల అధ్యాపకులు

దళితుల భూమి ఆక్రమణపై ధర్నా

పేదల భూమిని తక్షణమే వారికి అప్పగించాలని వినతి

ప్రజాశక్తి - అమలాపురం

దళితుల భూమి ఆక్రమణకు గురికావడంపై మంగళవారం కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బాధితులు, గ్రామస్తులు అల్లవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామంలో దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని స్థానిక గుత్తుల సత్యనారాయణ కుమారులు నాగరాజు, దుర్గారావు దౌర్జన్యంగా ఆక్రమించుకొని అనుభవిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 1975 సంవత్సరానికి ముందు ఉమ్మడి గ్రామ పంచాయతీ అయిన కొమరగిరిపట్నంలో తుమ్మలపల్లి గ్రామానికి చెందిన పేద దళితులైన 12 మంది కుటుంబాలకు అప్పట్లో ప్రభుత్వం ఆర్థికంగా భరోసా కల్పించేందుకు 'డి-ఫామ్' భూమిని ఒక్కో కుటుంబానికి 0.94 సెంట్ల చొప్పున మంజూరు చేసింది. అయితే ఆ భూమి ఉన్న కుటుంబ సమస్యలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంతకాలం సాగుకు దూరంగా ఉన్నారని బాధితులు అన్నారు. దీనిని ఆసరాగా తీసుకుని, అదే గ్రామానికి చెందిన గుత్తుల సత్యనారాయణ కుమారులు గుత్తుల నాగరాజు, గుత్తుల దుర్గారావు అను వ్యక్తులు దౌర్జన్యంగా ఆ భూమిని ఆక్రమించుకున్నారని అన్నారు. ఈ భూమి తమదే అని ప్రశ్నించగా, ఆక్రమణదారులు తప్పుడు లీజు పత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడుతు న్నారని బాధితులు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దళితులైన పేదలకి ప్రభుత్వం ఇచ్చిన భూమిని అక్రమంగా ఆక్రమించుకొని, దౌర్జన్యానికి పాల్పడిన గుత్తుల నాగరాజు గుత్తుల దుర్గారావులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆక్రమణదారుల నుంచి వెంటనే



వినతిపత్రం అందిస్తున్న బాధితులు, ప్రజాసంఘాల నాయకులు

భూమిని అసలైన హక్కుదారులు అయిన కుటుం బాల కు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆక్రమణ దారులు సృష్టించిన తప్పుడు లీజు పత్రాలను రెవెన్యూ రికార్డుల నుంచి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేదల భూములను బలవంతులు ఆక్రమించు కుంటే సహించేది లేదని, అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దళితుల భూము లు దళితులకు ఇప్పించాలని సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహి ంచామని దళితుల భూములు ఆక్రమించుకున్న గుత్తుల నాగరాజు, దుర్గారావు, రాత్రికి రాత్రి ఆ భూమి లో ఉన్న జీడీ మామిడి చెట్లను అక్రమంగా తొల గిస్తున్నారని అన్నారు. దీనిపై చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. అక్రమంగా భూములలోకి చొరబడి జీడీమామిడి తోటలు ధ్వంసం చేస్తున్నందుకు బాధితు లు ప్రశ్నించారన్నారు. అయితే బాధితులను చంపేస్తానని బెదిరించినందుకు గుత్తుల నాగరాజు, దుర్గారావులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లోఫిర్యాదు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో బాధితు కుటుంబాలు చింత వీర ప్రసాద్, యలమంచిలి రమేష్,కుంచె రమేష్, కుంచె సురేష్ సత్యనారాయణ, గెడ్డం వుల్లూరి శేఖర్, గెడ్డం రవికుమార్, కుసుమ మణిరత్నం, పరమట సురేష్, బిరుదు గంటి రామారావు, పులుసుగండి రఘురామ్, విపర్తి సురేష్, పల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్స వాలను పురస్కరించుకొని స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ ఇంధన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యుత్ శాఖ ఎఇ సత్యనారాయణ మాట్లాడారు. విద్యుత్‌ను పొదుపుగా వాడాల్సిన ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం వంగా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఎడిఇ ఎస్.శ్రీనివాస్, ఎల్ఐ కుమార్‌బాబు, ఉపాధ్యాయ సిబ్బంది రామలక్ష్మణ రాజు, రాంబాబు, శ్రీనివాసు, అరుణ్ కుమార్, విద్యుత్ లైన్‌మ్యాన్లు సత్యనారాయణ మూర్తి, ఇస్మాయిల్, బి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజానికి కృషి

ప్రజాశక్తి - అమలాపురం

పోలియో రహతి సమాజ స్థాపన ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం దుర్గారావు దొర మంగళవారం ఒక ప్రకటనలో ద్వారా పిలుపు నిచ్చారు. ఈనెల 21 వ తేదీ ఆదివారం పల్స్ పోలియో దినోత్సవంగా రాష్ట్ర ప్రభు త్వం ప్రకటించిందన్నారు. ఈనెల 21 న పల్స్ పోలియో నిర్మూలన దినోత్సవం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. 5 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయిం చాలని పిలుపు నిచ్చారు.

పల్స్ పోలియోకు ఏర్పాట్లు

మామిడికుదురు: నగరం,లూటు కుర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈనెల 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామని వైద్యాధికారులు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలో 21 బూతుల ద్వారా 3,044 మంది లక్ష్యంగా పోలియో డ్రాప్స్ వేయాలని వైద్యాధికారి జాన్ లెవీ పేర్కొన్నారు. లూటుకుర్రు పిహెచ్‌సి పరిధిలో 22 బూత్‌ల ద్వారా 2,826 మందికి పోలియో చుక్కలు వేయాలన్నది లక్ష్యమని డాక్టర్ కె.సత్యవతి తెలిపారు.



దహనం చేస్తున్న ప్రజాసంఘాలు

'విబి-జి రామ్‌జి' చట్టం కాపీల దహనం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బల్లగేటు సెంటర్ లోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన విబి-జి రామ్ జీ-2025 చట్టం కాపీలను జాతీయ రహదారిపై దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగా తీసుకొచ్చిన వీబీ-జీ రామ్ జీ-2025 పేరుతో తీసుకువచ్చిన బిల్లుతో పేదలను మరింత పేదవారిని చేయడమేనని అన్నారు. కేంద్రంలోని మనువాద మోడీ ప్రభుత్వం ఒక పక్క కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ, మరో పక్క పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని ఆ వర్గాలకు అందకుండా చేయడానికి చేస్తున్న కుట్రలో భాగమని దుయ్యాబట్టారు. కొత్త చట్టాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకుడు పాము బాలయ్య, దొమ్మేటి వీర రాఘవులు, వెంకటేష్, వి.దుర్గారావు, లక్ష్మణ రావు, కాకి రాంబాబు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సహకార ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం

రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ పిలుపు మేరకు మంగళవారం జిల్లా సహకార అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహి ంచారు. పిఎసియస్‌లలో 50 శాతం వాటాలను ప్రయివేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ 1964 చట్టానికి చేసిన సవరణలను రద్దు చేయాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. జిఒ 36, జి.ఒ 90 ప్రకారం వేతనాలను ఇతర బెనిఫిట్లను అమలు చేయాలన్నారు. ఏప్రిల్1 2019 నాటి వేతన సవరణ వెంటనే చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సహకార సంఘాల ఉద్యోగులు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సహ కార సంఘాల ఉద్యోగులకు హెచ్ఆర్. పాలసీ అమలు చేస్తామని 2019 మార్చి 1న జిఒ 36ను విడుదల చేసిందని, ఐదేళ్లగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నప్పటికి ఈ జిఒ అమలుకు నోచుకోలేదు. జిఒ ఇచ్చిన ప్రభుత్వమే వచ్చిందని మా సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజాప్రతినిధులకు, అధికారులకు అనేక విజ్ఞప్తిలు చేశామన్నారు. సహకార శాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు వెంటనే హెచ్ఆర్ పాలసి, తదితర సనుస్యలు పరిష్కరిస్తామని చెప్పారన్నారు. జిఒ 36లో పేర్కొన్న ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి 62 సంవత్సరములకు ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలన్నారు. పిఎసియస్‌లకు ఇన్‌కమ్ ట్యాక్స్ పూర్తిగా మినహాయింపును ఇవ్వాల న్నారు. టిడి యస్‌లో వున్న ఇబ్బందులను తొలగించాలన్నారు. ఇప్పటికే బ్యాంకులు వసూలు చేసిన టిడియస్. మొత్తా లను తిరిగి సంఘాలకు జమ చేయాలని డిమాండ్ చే శారు. సహకార శాఖ కమిషనర్ రిజిస్ట్రార్ వారు ఇచ్చిన ఆదేశాల ప్రకారం సంఘాల షేర్ ధనంపై 5 శాతం డివిడెండ్ లేదా వడ్డీ తక్షణమే చెల్లించాలన్నారు. అనంతరం డిమాండ్స్‌తో జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమం లో జిల్లా యూనియన్ గౌరవాధ్యక్షులు నూకల బలరాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంకే సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు యర్రంశెట్టి రామచంద్రరావు, సిపిఎం నాయకులు కారెం వెంకటేశ్వరరావు, జిల్లా డిప్యూటీ ప్రధాన కార్య దర్శులు కుంపట్ల అయ్యప్ప నాయుడు, మట్టపర్తి జయరాం, ఉపాధ్యక్షులు, మేడిచర్ల రామ లింగేశ్వ రరావు, బి. లీలా కృష్ణ, ఎ.సూరిబాబు, కె.శ్రీని వాసరాజు కార్యవర్గసభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



జిల్లా సహకార అధికారి కార్యాలయం వద్ద ఉద్యోగుల ధర్నా

21న రజక ఆకాంక్ష సభ

ప్రజాశక్తి-మామిడికుదురు

ఎపి రజక వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్, డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఈనెల 21న స్థానిక డిఎల్ఎఫ్.ఫంక్షన్ హాలు నందు రజక ఆకాంక్ష సభ నిర్వహిస్తామని మండల శాఖ గౌరవాధ్యక్షులు పసుపులేటి మహాలక్ష్మీరావు తెలిపారు పాశర్లపూడిలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం రజక ప్రతినిధులు పంపిణీ చేశారు. కార్పొరేషన్ చైర్‌పర్సన్ సి.సావిత్రి అధ్యక్షతన జరిగే రజక ఆకాంక్ష సభకు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావు, గుంటూరు వెస్ట్ ఎంఎల్ఎ గల్లా మాధవి ముఖ్య అతిథులుగా విచ్చేయుదురన్నారు. జిల్లాలోని రజకులంతా ఈ సమావేశానికి హాజరై ఆకాంక్ష సభను విజయవంతం చేయాలని కోరారు ఈ సమావేశంలో మండల శాఖ అధ్యక్షులు కోటిపల్లి సాయిబాబు, కార్యదర్శి కాట్రేనిపాడు నాగేంద్ర, ఉపాధ్యక్షులు గుడిమె ల్లంక కాశి, అధికారపు వీరన్న,పసుపులేటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

పజాశక్తి - రామచంద్రపురం

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం దతాయని ఎంపిపి అంబటి భవాని అన్నారు. నిరంతరం ఒత్తిడితో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. పట్టణంలో మంగళవారం డివిజన్ ఉపాధ్యాయులు ఆటల పోటీలు ప్రారంభ సభలో ఆమె పాల్గొని ప్రసంగిం చారు. ఉపాధ్యాయ ఆటల పోటీలు మొదటి రోజు జరిగిన ప్రారంభ సభలో ఉప విద్యాశాఖాధికారి ప్రత్తి రామలక్ష్మణమూర్తి అధ్యక్షత వహించారు. సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ ఛైర్మన్ గాధంశెట్టి శ్రీదేవి, కె.గంగవరం ఎంపిపి పంపన నాగమణి మునిసిపల్ కౌన్సిలర్ లు, మండల విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు, డిఎస్ఒ సుబ్రహ్మణ్యం, డాక్టర్ కోట సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఐదు మండలాల నుంచి మొత్తం 200 మంది ఉపాధ్యాయులు ఈ పోటీలో పాల్గొన్నారనీ విద్యాశాఖధికారి తాడి



ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఎంపిపి భవాని

వీరాఘవ రెడ్డి తెలిపారు. మొదటి రోజు జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో రాయవరం జట్టుపై కపిలేశ్వరపురం జట్టు, రామచంద్రపురం జట్టు మండపేట జట్టుపై విజయం సాధించాయి. మహిళల త్రోబాల్ మ్యాచ్ లో రామచంద్రపురం, కపిలేశ్వరపురం జట్లు విజయం సాధించి ఫైనల్‌కి చేరుకున్నాయి. బుధవారం ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని డివిజన్ ఇన్‌ఛార్జి వ్యాయామ ఉపాధ్యాయుడు ఆని శ్రీనివాస్ తెలియజేశారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

ప్రజాశక్తి - అయినవిల్లి

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. విలస, సిరిపల్లి, అయినవిల్లి గ్రామాలలో 'వాడవాడకు మన ఎంఎల్ఎ గిడ్డి' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ మూడు గ్రామాల ప్రజల నుంచి ఒక్కరోజులోనే మొత్తం 370 వినతులు స్వీకరించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఇళ్ల పట్టాలు, ఇంటి స్థలాలు, పెన్షన్లకు సంబంధించిన వినతులు అధికంగా వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ వినతులన్నింటినీ పరిశీలించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెసి, ఆర్‌డిఒ పాల్గొని వాడ వాడకు మన ఎంఎల్ఎ గిడ్డి ద్వారా అందిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, త్వరత్వరగా పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, విలస, సిరిపల్లి, అయినవిల్లి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.




వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

జీవనోపాధి కల్పించాలని వినతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

లొల్ల గ్రామానికి చెందిన దళితులకు జీవన ఉపాధి కల్పించాలంటూ ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు మంగళవారం ఇరిగేషన్ ఏఈ మాధవకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 కొబ్బరి మొక్కలు వేసుకొని తద్వారా జీవనోపాధి పొందుట 9 మంది లబ్ధిదారులకు చెట్టు పట్టా పట్టా పథకం ద్వారా పట్టాలు మంజూరు చేశారన్నారు. ఇటీవల ఇరిగేషన్ అధికారులు ఏవిధమైన నోటీసు ఇవ్వకుండా చెట్టు - పట్టా లబ్ధిదారుల మొక్కలను తొలగించారన్నారు. చెట్టు - పట్టా పథకం లబ్దిదారులు రక్షణ కల్పించి, జీవనోపాధి కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్ఆర్‌పిఎస్ ఉపాధ్యక్షుడు కుమ్మర రాఘవ, లొల్ల గ్రామ చెట్టు - పట్టా పథకం లబ్దిదారులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేడు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిం చాలని నేడు బుధవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహిస్తామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జివి.రమణ, ఎమ్‌టివి.సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాకు అధిక సంఖ్యలోఉపాధ్యాయులు హాజరుకా వాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పెంకె వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శిలు కుడుపూడి శ్రీనివాసరావు, పినిపే మురుగేశ్వరరావు ఉన్నారు.

ఆధార్ క్యాంప్ పరిశీలన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర సిద్ధార్థ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంప్ ను మంగళవారం ఎంపిడిఒ హెచ్ భానుజీ రావు పరిశీలించారు. ఆయన సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 16 నుండి 24వరకు రెండు విడతలగా ప్రత్యేక ఆధార్ క్యాంప్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పదిలో నూరు శాతం ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

టెన్త్ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి నూరు శాతం ఫలితాలను సాధించాలని జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట కో ఆర్డినేటర్ జి మమ్మీ పేర్కొన్నారు. మండలంలోని ఠానేలంక జెడ్‌పి ఉన్నత పాఠశాలను, అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులను ఇప్పటి వరకు జరిగిన సిలబస్ నుండి ప్రశ్నలు అడిగి సమాధా నాలు రాబట్టారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాకరం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పదో తరగతి పరీక్షలలో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు జరుగుచున్న తీరు తెన్నులను పరిశీలించారు. . విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని రాబోవు పది పబ్లిక్ పరీక్షల్లో జిల్లాను ప్రథమ స్థానం సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎంఒ బివివి.సుబ్రహ్మణ్యం, డిసిజిఒ ఎంఎకె.భీమారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలం పిలుస్తోందిని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కాట్రేనికోన

పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని బి.మృదుల పేర్కొన్నారు. మంగళ వారం మండల పరిధిలోని బంటుమిల్లి గ్రామంలో ఆమె ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం లో ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త కో-ఆర్డినేటర్ ఎం.నంద కిషోర్, ఎడిఎ గౌతమ్ కుమార్, జిల్లా వనరులు కేంద్రం ఎఒ జి.మనోహర్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. దాళ్వాకు అనువైన ఎంటియు 11 21, 12 82, చౌడు భూమిని తట్టుకునే రకమైన ఎంటియు 1293 సాగు చేసుకోవాలని సూచించారు. నారు వేసే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. జింకులోప నివారణకు, ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, విఎఎలు పాల్గొన్నారు.

మోడరన్ విద్యార్థుల విజ్ఞానయాత్ర

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్నంలోని మోడ్రన్ కళాశాల విద్యార్థులకు విజ్ఞానయాత్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎబిసి మోడరన్ ప్రైమరీ విద్యార్థులు కడియం నర్సరీలు, ధవళేశ్వరం బ్రిడ్జి, కాటన్ బ్యారేజ్, గోదావరి నది పరివాహక ప్రాంతాలను సందర్శించారు. అకడమిక్ డైరెక్టర్ ఎ. రమాదేవి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులను తరగతి గదులకే పరిమితం చేయకుండా ప్రతి అకాడమిక్ ఇయర్ లో వివిధ ప్రాంతాలకు ఫీల్డ్ ట్రిప్ ద్వారా తీసుకుని వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విధమైన విజ్ఞాన యాత్రల ద్వారా విద్యార్థుల్లో ఆసక్తి పెరిగి అభ్యాసన ప్రక్రియ మరింత మెరుగవు తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎబిసి మోడరన్ ప్రైమరీ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్షునిగా గుత్తుల సాయి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జిల్లా టిడిపి అధ్యక్షునిగా గుత్తుల వెంకట సాయి శ్రీనివాస్‌ను పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. మండలంలోని గాడిలంక ఆయన స్వగ్రామం గాడిలంక సర్పంచ్ గాను, 2000లో ముమ్మిడివరం ఎంపిపిగా, 2005లో పి.గన్నవరం జడ్‌పిటిసి సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. సాయికి జిల్లా అధ్యక్షుడు పదవి దక్కడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. సాయికి జిల్లాలో ఎంఎల్ఎలు, ఎంపి హరీష్, మంత్రి సుభాష్ మద్దతు ప్రకటించారు. ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు కృషితో సాయికి జిల్లా టిడిపి అధ్యక్ష పదవి దక్కింది.



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ ఊర్మిళదేవి

విలసవిల్లిలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

విలసవిల్లి ప్రార్థనాశక్తి మంది రంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో సర్పంచ్ సలాది ఊర్మిళదేవి పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, పాస్టర్ రాము పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేట గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సామర్లకోటకు చెందిన డి.పండు, డి.అక్షయ్‌కుమార్ మోటార్ బైక్ పై ప్రత్తిపాడు వెళుతుండగా జి.రాగంపేట వద్ద బైకు అదుపుతప్పింది. దీంతో ఆ యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారికి పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం యానాం నుంచి అమలాపురం ఊకలోడుతో ట్రాక్టర్ వెళుతోంది. ఈ సమయంలో నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బొండాయికోడు తూము సెంటర్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్ స్కూటీపై వెళ్తున్న మహిళను తప్పించబోయాడు. దీంతో ట్రాక్టర్ పంట కాలువలోకి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఉప్పలగుప్తం మండలం కూనవరం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వరసాల సత్య నారాయణ (58) మృతి చెందాడు. స్కూటీపై వెళున్న మహిళకు గాయలయ్యాయి. మృతునికి భార్య నారాయ ణమ్మ, ఒక కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మరణం

ప్రజాశక్తి - చాగల్లు

పసివేదల రైల్వే స్టేషన్ ట్రాక్ మధ్యలో గుర్తుతెలియని 40 ఏళ వయసు ఉన్న వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు జిఆర్‌పి ఎస్ఐ పి.అప్పారావు తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9490617090, 7013360296 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

405.7 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - గోకవరం

405.7 కేజీల గంజాయిని గోకవరం పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కామరాజుపేట శివారులో రోడ్డు పక్కన అనుమానాస్పదంగా ఉన్న వ్యాన్‌పై గోకవరం ఎస్.ఐ పవన్ కుమార్‌కు సమాచారం వచ్చింది. ఎస్ఐ సిబ్బందితో వెళ్లి వ్యాన్‌ను తనిఖీ చేయగా అందులో మొత్తం 22 బస్తాల్లో 405.7 కేజీల గంజాయి గుర్తించినట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - కడియం

మండలంలోని పొట్టిలంక 216 జాతీయ రహదారిపై మంగళవారం రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. కడియపులంక నుంచి వస్తున్న లారీ పొట్టిలంక జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన డివైడర్ నుంచి వేమగిరి వైపు వెళ్లేందుకు యూటర్న్ తిరుగుచుండగా బైకుపై వస్తున్న కడియపులంకకు చెందిన కర్రి సూరిబాబు (35) లారీని వెనుక భాగంలో బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి -దేవరపల్లి

సంసద్ ఖేల్ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ ఆధ్వర్యంలో దేవరపల్లి మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నాగార్జున తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు 19, 20న జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని, అన్ని పోటీలూ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని వారు పేర్కొన్నారు. క్రీడాకారులు సమయానికి హాజరై పోటీల్లో పాల్గొనాలని అధికారులు సూచించారు. ఎంఇఒ, క్రీడాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు.


నూతన కార్యవర్గానికి అంబాజీపేట యుటిఎఫ్ అభినందన

యుటిఎఫ్ జిల్లా కమిటీకి అభినందన

ప్రజాశక్తి- అంబాజీపేట

రాయవరం మండలం పసలపూడిలో జరిగిన యుటిఎఫ్ జిల్లా కమిటీ ఎన్నికలలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా పింకే వెంకటేశ్వరరావు, నూతన అధ్యక్షునిగా జివి.రమణ, ప్రధాన కార్యదర్శిగా ఎమ్‌టివి,సుబ్బారావు, జిల్లా ఎఫ్‌డబ్ల్యుఎస్ డైరెక్టర్ గా పి.నారాయణమూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులుగా జి.రాంబాబు ఎంపికయ్యారు. వీరికి మంగళవారం యుటిఎఫ్ అంబాజీపేట మండల శాఖ పక్షాన ఉద్యమ అభినందనలు తెలిపారు.

ఎపిటిఎఫ్ మండల అధ్యక్షునిగా రవికుమార్

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఎపిటి ఎఫ్(1938) మండల అధ్యక్షునిగా గుత్తాల రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా నెల్లి వెంకట్రావు నియమితులయ్యారు. వీరిని జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్. మునేశ్వరరావు నియమించారు. నియామక పత్రాలను బుధవారం ఎంఇఒ సత్తికృష్ణకు మునేశ్వరరావు అందజేశారు.


అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సుభాష్

ప్రజాదర్బార్‌కు 950 అర్జీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో మంగళవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నిర్వహించిన ప్రజా దర్బార్ కు విశేష స్పందన లభించింది. నియోజకవర్గం లోని కే గంగవరం మండలం కాజులూరు మండలం లోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలుతో మంత్రి కార్యాలయం కిటకిటలాడింది. ప్రజా దర్బార్ కు మొత్తం 950 అర్జీలు అందాయి. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఎఎంసి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, దూడల శంకర్ నారాయణ, కె. గంగవరం, కాజులూరు మండలాల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, చవ్వాకుల నారాయణమూర్తి, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ సలాది రమేష్,పాల్గొన్నారు. ఔ

పలువురికి మంత్రి ఆర్థిక సాయం

పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం పలువురికి ఆర్థికంగా సహాయం అందించారు. చోడవరంకు చెందిన అయినవిల్లి సత్యవతి మానసిక వ్యాధితో బాధపడుతుండగా మంత్రి సుభాష్ ఆమెకు రూ.10 వేల చెక్కు అందజేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న అముజూరు గ్రామానికి చెందిన శాకా చినబంగార్రాజుకు రూ. 3 వేలు సాయం, నిత్యవసర వస్తువులు అందించారు. రామచంద్రపురానికి చెందిన నడిపల్లి సత్యనారాయణ ఊపిరితిత్తుల సమస్యతో బాధపడు తుండగా అతని ఆరోగ్య సమస్య తెలుసుకొని నెలకు సరిపడా అవసరమైన మందులు కొని అందించారు.

శిరోముండనం బాధితులకు కుల ధృవీకరణ పత్రాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్రంలో సంచలనం కలిగించిన వెంకటాయపాలెం శిరోముండనం బాధితులకు కుల ధృవీకరణ పత్రాలను మంత్రి వాసంశెట్టి సుభాష్ అందజేశారు. శిరోముండనం సంఘటన జరిగి సుమారు 30 ఏళ్లు కావస్తుంది. ఈ కేసులో బాధితులకు అప్పటినుండి కుల ధృవీకరణపత్రాలు అందకుండా పలు ఆటంకాలు సృష్టించడంతో బాధితులు పిల్లలను చదివించుకునేందుకు కుల ధృవీకరణ పత్రాలు లేక పలు ఇక్కట్లకు గురయ్యారు. దీంతో బాధితులు రాష్ట్ర మంత్రి సుభాష్ ను కలిసి కుల ధృవీకరణ పత్రాలు ఇప్పించాలని విన్నవించారు. దీంతో మంత్రి అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో దళిత శిరోమండలం బాధితులకు కుల ధృవీకరణ పత్రాలు అందజేశారు. ధృవీకరణ పత్రాలు అందుకున్న బాధితులు చల్లపూడి పట్టాభి రామయ్య, కోటి చినరాజు, దడాల వెంకటరమణ లు మంత్రి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

ఫోన్ యాప్‌ల ద్వారా జరిగే ఆన్లైన్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని నగరం ఎస్ఐ చైతన్య కుమార్ అన్నారు. ఫోన్ ప్యాక్ కాల్ వల్ల జరిగే ఆన్లైన్ మోసాలపై ఆయన అవగాహన కల్పించారు. నగరం సాయి దీప్తి జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులతో ఎస్ఐ మంగళవారం పలు అంశాలపై మాట్లాడారు. ఫోటో మార్ఫింగ్, వీడియో కాల్ గురించి వివరిస్తూ వాటి వల్ల మోసపోవద్దన్నారు. మైనర్ విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మోటార్ సైకిల్ నడిపితే జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె.శివప్రసాద్, అకడమిక్ ప్రిన్సిపల్ కె.సత్య వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎఒ సాయిబాబా, గ్రేడ్ వన్ కార్యదర్శి సత్తిబాబులను సన్మానిస్తున్న ఎంపిడిఒ తదితరులు

పలువురికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం.

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న బి. సాయిబాబాకు ఎఒగా ఉద్యోగోన్నతి లభించింది. ఈయన ఐ. పోలవరం మండలానికి ఎఒ గా బదిలీ అయ్యారు. అలాగే వల్లూరు పంచాయతీ గ్రేడ్-2 పంచాయితీ కార్యదర్శిగా పనిచేయుచున్న కె.సత్తిబాబు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొంది రామచంద్రపురం మండలం తాళ్ళపొలం పంచాయతీ కార్యదర్శి గాను, కాలేరు పంచాయతీ కార్యదర్శి ఇదే మండలంలో గ్రేడ్-2 గా పనిచేస్తున్న యు. సుప్రియ గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగోన్నత పొంది ఇదే మండలంలో టేకి పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఉద్యోగోన్నతి పొందిన వారిని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ హెచ్.భానుజీ రావు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఒ జి.రాజేంద్రప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ బి.వరప్రసాద్, సచివాలయ డిప్యూటీ ఎంపిడిఒ వి.రామమూర్తి, కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులుపాల్గొన్నారు.


మాట్లాడుతున్న డివిజనల్ ఇన్‌ఛార్జి

ప్రకృతి సాగుపై అవగాహన

ప్రజాశక్తి - రావులపాలెం

డ్వాక్రా మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అధికారులు అవగాహన కల్పించారు. రావులపాలెంలో రైతు సాధికారత సంస్థ కన్వర్జెన్సీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో డివిజన్ ఇన్‌ఛార్జి ఎల్.ప్రసాద్, ఎపిఎం విజయ్ పాల్గొన్నారు. ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎంఎన్ఎఫ్ (నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్) గ్రామాలలో చేయవలసిన కార్యక్రమాలు గురించి వివరించారు.అలాగే బీజామృతం వలన ఉపయోగాలు వివరించారు. విత్తన శుద్ధి విధానాన్ని చూపించారు. అనంతరం డ్వాక్రా ఎపిఎం విజయ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ భూమి ఆరోగ్యం, మన ఆరోగ్యం కాపాడుకునే ఆవశ్యకత ఉందని తెలిపారు. అలాగే ప్రతీ ఒక్కరు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకుని వెళ్ళాలి అంటే ప్రతీ డ్వాక్రా సభ్యురాలితో మాత్రమే ఇది సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య సభ్యులు, ప్రతినిధులు , ప్రెసిడెంట్ ఎమ్.దేవి పార్వతి, సెక్రటరీ బి.అన్నపూర్ణ, సిసిలు, విఒఎ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఐసిఆర్‌పిలు, యూనియ్ ఇన్‌ఛార్జి శాంతి కుమారి, ప్రసాద్, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

బోస్‌పై విమర్శలు తగవు

ప్రజాశక్తి - రామచంద్రపురం

సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను, ఆయన కుమారుడు సూర్యప్రకాష్‌పై విమర్శలు తగవని వైసిపి నాయకులు అన్నారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కొయ్య బంగారు బాబు, పార్టీ ప్రచార కార్యదర్శి రేవు నాగేశ్వరరావు మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బోస్‌ను, సూర్యప్రకాష్‌ను కాటే సుబ్రహ్మణ్యం అనే వ్యక్తికి స్థాయి మరిచి విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. అసలు అతను ఏ పార్టీలో కొనసాగుతున్నాడు స్పష్టం చేయాలన్నారు. లేకుంటే దళితుల ఆగ్రహాన్ని చవి చూడవలసి వస్తుందన్నారు. సుబ్రహ్మణ్యం విమర్శలను వారు ఖండించారు. సమావేశంలో నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు గుబ్బల శ్రీను, మున్సిపల్ కౌన్సిలర్ పోతంశెట్టి గోపాలకృష్ణ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు యనమదల శ్రీను, కాజులూరు మండలం యువజన విభాగం ఉపాధ్యక్షులు నిమ్మతి విజయ్, కందులపాలెం గ్రామ సర్పంచ్ పెంకె వీర రాఘవులు, దంగేరు-2 గ్రామ కమిటీ అధ్యక్షులు దారా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - అయినవిల్లి

అనపర్తిలో జరిగినకరాటే ఛాంపియన్షిప్ పోటీలలో అయినవిల్లి మండలం ముక్తేశ్వరం రారాజు జిమ్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు వారిలో జి.ధనుష్, కె.చరణ్‌సూర్య, ఎల్.సోమనాథ్ బంగారుపతకాలు, బి.దేవగణేష్ కాంస్య పతకం సాధించారు విజేతలకు జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు కుడుపూడి విద్య సాగర్, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, సిరిపల్లి ఎంపిటిసి సభ్యుడు యడ్ల కిరణ్‌బాబు, బొంతు శ్రీనివాస్ కరాటేలో విజయం సాధించిన మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కరాటే విద్య, ఆత్మరక్షణకు, ఆరోగ్యానికి మంచిదన్నారు. ప్రతి ఒక్కరూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిమ్, కరాటే మాస్టర్ రారాజు ను అభినందించారు.

బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలి

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా పరిధిలోని అన్ని విద్యాసంస్థలలో చదువుతున్న 5 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థుల ఆధార్ కార్డులకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేషన్ చేయించుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా పిలుపు నిచ్చారు. ఆధార్ జారీ సంస్థ నిబంధనల ప్రకారం పిల్లలకు 5 సంవత్సరాలు, 17 సంవత్సరాల వయస్సులో రెండు సార్లు బయోమెట్రిక్ అప్డేట్ ఫోటో, వేలిముద్రలు, ఐరిస్ చేయడం తప్పనిసరని అన్నారు. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథార్టీ ఆఫ్ ఇండియా ఇటీవల ప్రకటించిన మార్పుల ప్రకారం 5 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్‌పై నిర్దేశించిన ఛార్జీలు ఒక సంవత్సరం పాటు మిన హాయించబడ్డాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని దగ్గరలోని ఆధార్ నమోదు, అప్డేట్ కేంద్రాలను ఈనెల 16 నుంచి 20 వరకు మొదటి దఫాగా రెండో దఫాగా ఈనెల 22 నుంచి 24 వరకు ఆయా పాఠశాలల్లో క్యాం పులు నిర్వహించి మొత్తం 8 రోజులలో జిల్లా వ్యాప్తంగా గణాంకాలు సూచిస్తున్న 27, 472 మందికి ఆధార్ అప్డేషన్ సుమారు 90 కిట్లతో నమోదు చేస్తారన్నారు.

అంతర్వేదిలో పూజలు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

అంతర్వేది శ్రీలక్ష్మీ నారసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు..

పైడిమెట్ట పాఠశాలలో విజయ్ దివస్

ప్రజాశక్తి-తాళ్లపూడి

ప్రతి విద్యార్థీ చిన్నతనం నుంచీ దేశభక్తితో మెలుగుతూ అవసర సమయంలో దేశం కోసం ఉద్యమం చేయడానికి ముందడుగు వేయాలని పైడిమెట్ట ఎంపిబిపి పాఠశాల హెచ్ఎం దున్నా దుర్గారావు అన్నారు. డిసెంబర్ 16న విజయ్ దివస్‌ను పురస్కరించుకుని పాఠశాల వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ పతాకాన్ని చేతబూని ప్రదర్శన చేశారు. దుర్గారావు మాట్లాడుతూ 1971లో పాకిస్తాన్‌పై భారత సైన్యం సాధించిన విజయాన్ని పురస్కరించుకుని విజయ్ దివస్‌ను ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు.

సంసద్ ఖేల్ క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరంలో పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంసద్ ఖేల్ క్రీడా పోటీలను రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ మంగళవారం ప్రారంభించరాఉ. అనంతరం పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సంపద్ ఖేల్ పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. మానసిక ఒత్తిడిని జయించడానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులకు స్ఫూర్తి, ఆరోగ్యం, సమిష్టి నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, ఎంపిడిఒ భారతి, తహశీల్దారు శ్రీనివాస్, ఎంఇఒ స్వామి నాయక్, ఇతర అధికారులు, జనసేన, టిడిపి, బిజెపిలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళీధర్ మృతి

ప్రజాశక్తి రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ మాజీ కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, వైసిపి నాయకుడు గుత్తుల మురళీధర్‌రావు (56) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి వైసిపి నాయకులు జక్కంపూడి రాజా, చెల్లుబోయిన వేణు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

పల్స్ పోలియోపై శిక్షణ

ప్రజాశక్తి-పెరవలి

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పెరవలి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రాజనాల ప్రసాద్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఉన్న ఆరోగ్య సిబ్బందికి పల్స్ పోలియోపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజనాల ప్రసాద్ మాట్లాడుతూ 21న పల్స్ పోలియో చుక్కలు 0 నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ రెండు వేస్తారని తెలిపారు. పిహెచ్‌సి పరిధిలో 5,320 మంది పిల్లలు ఉన్నారని, వైద్యాధికారి డాక్టర్ రాజనాల ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఉమా రాజ్యలక్ష్మి పద్మజ, ఎంఇఒ షేక్ సూర్జన్, సిడిపిఒ ఎం.ఆశా రోహిణి పాల్గొన్నారు.

మంత్రి పవన్ కల్యాణ్ పర్యటకు ఏర్పాట్లు

ప్రజాశకి-పెరవలి

పెరవలి మండల కేంద్రంలో 20న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటనా ఏర్పాట్లను మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం పరిశీలించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌డిఒ సుస్మిత, తహశీల్దారు కె.నిరంజన్, ఎంపిడిఒ పద్మజ, జనసేన నాయకులు పిప్పర రవికుమార్, కోటిపల్లి మురళీకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు నందిప శ్రీనివాస్ చక్రవర్తి, జిల్లా నాయకులు తులా చినబాబు, రాంబాబు, సంగీత నాగు పాల్గొన్నారు.


దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న వంశ పారంపర్య ధర్మకర్త చక్రి

బాల బాలాజీ దేవస్థానం అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం లో నిర్వహించే అన్నదాన ట్రస్ట్‌కు యలమంచిలి మండలం వైవి.లంకకు చెందిన చేకూరి నాగరాజు, గంగాదేవి దంపతులు, వారి కుటుంబ సభ్యులు మంగళవారం ట్రస్ట్‌కు రూ.10,500 విరాళంగా సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. దాతకు దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ(చక్రి) స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈనెల 30న ఉత్తర ద్వార దర్శనం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అలంకరణలతో శయన మండపంలో ఉభయ దేవేరులతోపాటు స్వామి వారి దర్శనం నిమిత్తం ఏర్పాట్లుచేశామని ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు. యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.